


పదేళ్ళకి స్వదేశానికి తిరిగివొచ్చాను. ఇండియా రాయబారికింద నన్ను జూలూలాండుకి పంపారన్నమాట జగద్విదితమే. నూలు పోటీపరీక్షలో. మా బావమరిది ధర్మాన నాకు మొదటిబహుమానం రావడంవల్లనూ, ఇంగ్లీషువారు నన్ను ఆరుసార్లు జైలుకి పంపడంవల్లనూ ఆ ఉద్యోగం నాకు నేనే పిలిచి ఇప్పించుకున్నాను. రోడ్డుమీదివాళ్ళని తన్నవచ్చునా ఎంత తాగితే మాత్రం, అన్న విషయాలపై నాకూ పోలీసువాళ్ళకీ బేధాభిప్రాయాలు ఏర్పడబట్టి మొదటి రెండుసారులూ నన్ను బలవంతాన జైలుకి పంపారు. ఖద్దరు కట్టుకున్నాను గనక "గాంధీకి జై" అంటూ జైలుకి వెళ్లాను. మూడోసారి ఎక్కడవున్నామో ఏం చేస్తున్నామో తెలీక కాంగ్రెసువాళ్ళని పోలీసువాళ్ళు మీటింగులో తంతూవుంటే, పాతకోపాన ఓ ఇన్స్పెక్టర్ని సీసాకాయితో నెత్తిమీద కొట్టేటప్పటికి మళ్ళీ జైలులో పెట్టారు. విడుదల ఐనప్పుడు తక్కినవాళ్లకన్న నాకు ఎక్కువ పూలదండలువేసి వూరేగించడంవల్ల తరవాత ప్రతిసారీ జైలుకి వెళ్ళక తప్పిందికాదు.

రెండుమూడు సంవత్సరాలు భారతప్రతినిధిగా ఆదేశంలోవున్నతరవాత నా ఉద్యోగంవుందో లేదో నాకు నిశ్చయం లేకపోయింది. ఈదేశంలో నన్ను నియమించినప్రభుత్వం నిలిచిందో వూడిందో తెలీలేదు. కాని అప్పటికే నేను స్వయంపోషక ప్రావీణ్యున్నైనాను. అంటే అక్కడిస్త్రీలు నామీద experiment చేయ మొదలుపెట్టారు. నారంగు వాళ్ళనించి బేధించడంవల్ల, నాలో శృంగారబేధంకూడా వుంటుందని ప్రతీతి కలిగింది. కొంతకాలం ధనంగల వితంతువుల చేతులు మారాను, నాకోసం డిమాండు అమితమై, వాళ్ళలోవాళ్ళు కాంపిటిషన్ భరించలేక, స్త్రీలు ఒక మీటింగుచేసి, నన్ను నా స్వదేశానికి పంపితేనేగాని అంతర్జాత్యుద్ధం తప్పదని భయపడి, relief order నాచేతి కిచ్చారు. రెండునెలలు వీడ్కోలువిందులు పడకలూ జరిగాయి. బలము సీదాపోయి, ఇంక బతుకుమీద ఆశవుంటే భారతమాతని చూడాలంటే వదవెక్కక తప్పదనుకున్నాను. మొత్తానికి, జూలూదేశంలో భారతజాతికి కామ ప్రతిష్ఠని, అందులో స్వతంత్ర భారత స్తంభనకీర్తిని అప్రతిహతంగా నిలబెట్టగలిగానని నాగర్వం.

రేవుపట్నానికివెళ్ళి ఓడల ఆఫీసులో ఇండియాకి వెళ్లాలని అడిగాను.

"ఇండియా, ఇండియా?" అని తల గోక్కున్నాడు ఆ ఆఫీసరు.

"అవును."

"ఇండియా?....అవును....ఇండియా. ఒకదేశం వుండాలి అట్లాంటిది." అని పక్క వాళ్ళని పిలిచాడు. వాళ్ళు లేచివొచ్చి ఆయనచుట్టూ నుంచున్నారు.

"ఇండియాకి వెళ్లాలిట. ఇండియా ఎక్కడవుంది?"

"పర్షియాకి తూర్పుగా, చైనాకి నైరుతిగా వుండేది పూర్వం" అన్నాడు ఒక జాగ్రఫీ పండితుడు.



"ఇప్పుడు అక్కడ లేదా?" అన్నాను గద్గదకంఠంతో.

"వుండే వుండవొచ్చు .... ఎందుకంటే, చాలారోజులయింది ఆదేశం సంగతి విని." అన్నాడు ఒకాయన.

"అంత కళ్ళుమూసుకుపోయినాయా మీకు?" అన్నాను కోపంతో, నన్ను వేళాకోళం చేస్తున్నారని.

"కోప్పడకండి. మేమే కాదు. ప్రపంచంలో ఎవరికీ అట్టే తెలీనట్టుంది ఆ దేశంసంగతి ఇప్పుడు" అన్నారు ఇంకోరు.

"ఏం?"

ఆలోచించారు వాళ్ళు. ఒకాయనకి జ్ఞాపకం వొచ్చినట్టుంది.

"ఆ ..అదీ....స్వయంనిర్ణయం అయిపోయింది" అన్నాడు.

"అవును. స్వయంనిర్ణయం అయిపోయింది" అన్నాడు ఇంకోఆయన జాలిగా.

"అవును పాపం స్వయంనిర్ణయం చేసుకుంది" అన్నాడు పెదవివిరిచి ఇంకో ఆయన.

"అంటే?" అని అడిగాను.

"అంటే, తనసామానుల్ని తానే తయారుచేసుకుంటోంది."

"అయితేనేం? తప్పా?"

"తప్పేముంది? ఇతరప్రపంచంతో సంబంధంపోయింది."

"మరి ఎగుమతులు?"

"తనసరుకుల్ని తానే వుపయోగించుకుంటోంది."

"ఇతరదేశాలతో రాయబారం?"

"ఇండియాకి అవసరంలేదు."

"మరి యుద్ధాలూ, సంధులూ?"

"ఏమక్కర్లేదు. ఎవరినించి ఆదేశానికి భయంలేదు."

"ఎందుచేత?"

"సహాయనిరాకరణం చేస్తుంది."

"ఓ."

అని దిక్కులు చూస్తున్నాను.

"మరి మా దేశం స్టీమర్లు రావా?"

ఇంతలో ఇంకోఆయన వొచ్చాడు.

"ఇండియా సంగతా? ఇండియాకి స్టీమర్లు లేవు. యుద్ధనౌకలు లేవు. ఏదేశంనించు స్టీమర్లు ఆదేశానికి పోవు, అవసరంలేదు. ఆదేశాన్నించి ఇంకోదేశానికి స్టీమర్లురావు."

ఆరువారాలుకాచుకొని సింహళం వెళ్ళేవోడని ఒకదాన్ని పట్టుకున్నాను. ఆవోడ అధిపతి

"ఇప్పుడు లోకంమారింది. మిమ్మల్ని దిగవీరు సింహళంలో. దిగనిచ్చినా, ఇండియాకి రాకపోకలులేవు సింహళంనించి. అయినా ఎందుకువెళతారు ఆదేశం? వొద్దు. నామాట వినండి" అన్నాడు.

ఎట్లాగయితేనేం బతిమాలి బొంబాయిలో నన్ను దింపడానికి ఏర్పాటు చేసుకున్నాను. అంటే నాశక్తిగల ప్రియురాలి influence ఉపయోగించి.

ఓ అర్థరాత్రికి బొంబాయి చాలా కులాసాగా ప్రయాణంచేసి చేరుకున్నాను. పోవొద్దని నామెడచుట్టూ చేతులు పెనవేసుకుకూచున్న ఐర్మీసు వనితనీ, నా నడుంచుట్టూ కన్నీళ్ళతో

వేళ్లాడుతున్న జపాను ప్రియురాలినీ తప్పించుకుని చిన్నపడవలో ఎక్కాను. ఆపడవ నన్ను వొడ్డునదింపి చక్కాపోయింది.

హార్బర్‌లో లైట్లు వెలుగుతున్నాయి. కాని ఎవరూలేరు. ఇంకేవోడలూ లేవు. నావెంట నాలుగు బరువైనపెట్టెలు తీసుకొచ్చాను. ఏంతోచక ఆపెట్టెల్నివొదిలి అటూఇటూ నడిచాను. ఒకచోట పడిపోయిన ఒకగదిమీద 'కస్టమ్స్' అని హిందీలో ఒక బోర్డువుంది. ఒక్కొక్క పెట్టెనే మోసుకుపోయి అక్కడపెట్టుకుని తలుపుకొట్టాను. చాలాసేపటికి కళ్ళు నులుముకుంటూ ఒకాయన గడియతీసి తలుపులోంచి తొంగిచూశాడు. నేను గబగబా ప్రశ్నలడిగాను, ఇదివరకు నేర్చుకున్న తురకంలో.

"కార్లు లేవా? కూలీలు లేరా? కస్టమ్స్ లేదా?" ఇట్లాంటివి.

వాటన్నిటికీ అతను, మంచిహిందీలో "ఎవరు?" అన్నాడు.

చెప్పాను.

"ఓడలోంచి దిగారా? ఓడలోంచి ??" అని వింతగా సముద్రంకేసి చూశాడు.

చాలా interest తో, అపూర్వమైన విశేషం జరిగినట్టు నా సంగతంతా కనుక్కున్నాడూ,

"తమాషా, తమాషా" అంటో తలుపువేసుకొంటున్నాడు.

నేను అడ్డపడి ఆపి, "నేనేం చెయ్యాలి?" అని అడిగాను.

"నిద్రవొస్తోంది" అన్నాడు,

"మరి కస్టమ్స్ సంగతేమిటి?" అన్నాను.

"పూళ్ళో వున్నాడనుకుంటాను, పిలిపిస్తాను" అన్నాడు.

"మీరెవరు ?"

"నేను బొంబే గవర్నర్ని. సముద్రంగాలికి ఇక్కడ పడుకున్నాను" అన్నాడు; ఆ పడిపోయిన పాతగదిలో.

పిచ్చివాడితో మాట్లాడుతున్నాను. ఆ గవర్నరు తెల్లని ఖద్దరునిక్కరూ బనియనూ వేసుకున్నాడు.

"మరి నే నెక్కడికిపోను ?"

"ఎక్కడికిపోవాలి మీరు ?"

గొర్రిపూడి మావూరు.

"రైలు దొరికిందాకా హోటలుకి వెళ్లాలి."

"హోటలా ? హోటలేమిటి ? సరే వెళ్ళండి" అని తలుపు మూసుకుంటున్నాడు.

ఇంతలో అతని మల్లేనే - అంటే ఖద్దరు నిక్కరూ, బనియనూ - కాని ఆకుపచ్చరంగువి వేసుకున్న ఇంకొక అతను వొచ్చాడు. ఆ గవర్నరు, "అమ్మా, రక్షించావు, ఇతనిసంగతి చూడు" అని వెళ్ళి తలుపువేసుకుని పడుకున్నాడు.

మళ్ళ ఈ కొత్త అతనికి నాకథ అంతా చెప్పాను. అంతకన్న ఆశ్చర్యంతో బాధ్యతతోనూ విన్నాడు.

"మీరెవరు ?" అన్నాను.

"నేను పోలీసు. అదృష్టమే. ఈ వుక్కకి నిద్రపట్టక ఇటు షికారువొచ్చాను. సరే వుండండి ఇక్కడే." అని వెడుతున్నాడు.

"ఇక్కడా ? ఎట్లావుండను ? నిద్రపోవొద్దా ?"



"ఓ Taxi తెప్పిస్తే—"

"Taxi !!! అంటే ?"

"అంటే........" తలగోక్కున్నాను.

"ఇక్కడ బావుండలా ! చల్లనిగాలీ అవీ. పూళ్లో వుక్క. అదిగాక కస్టం [illegible] వొస్తేనేగాని రైలెక్కడానికి వీల్లేదు."

"ఎప్పుడు వొస్తాడు ?"

"కబురు పంపుతాను. రేపు."

"అదేమిటి ? ఎప్పుడూ వుండడా ఇక్కడ ?"

"ఎందుకూ వుండడం ? మీకుతొందరా ?"

"కాదా ?"

"ఎందుకు తొందర ?"

"మావూరు పోవాలి."

"ఎవరన్నా మీవాళ్ళకి చాలా జబ్బుగావుందా ?"

"లేదు వెళ్ళాలి."

ఆశ్చర్యంగా చూశాడు, 'తొందర' అనేమాట విననట్టు.

"సరే కానీండి. తమాషామనిషిలాగు వున్నారు, రండి" అని పక్కన ఇంకో చిన్న రెల్లుపాకదగ్గిరికి వెళ్ళి తలుపుకొట్టాడు. ఎవరూ పలకలేదు, కాని తలుపు గట్టిగాతోస్తే వూడివొచ్చింది. ఆగదిలో ఓ పాత టెలిఫోనువుంది. దానినిండా రెండు అంగుళాల ఎత్తున దుమ్ము, టార్చిలైటుతో ఓ చిరుగు పుస్తకంలో ఓ నంబరు వెతికి, డయల్‌చేశాడు. కొంచెం సేపటికి గంటమోగింది. ఏంచెప్పాలో కనుక్కుందామని చూస్తే ఆ పోలీసులేడు. వెనకగదిలో ఎవరినో లేపుతున్నాడు.

ఎవరో నాచెవులో టెలిఫోనులో 'ఎవరు ? ఎవరు ?' అంటున్నాడు ?

"కస్టమ్స్ మీరేనా ?"

"అవును. ఏం ?"

"పడవదిగి వొచ్చాను."

"అవతలపో, నిద్రవొస్తోంది."

"రండి."

"వూరికే గోలచెయ్యకు, అర్ధరాత్రి ఏమిటీ వేళాకోళం."

నిజమని నచ్చచెప్పాను.

"గవర్నమెంటు ఎద్దుని పొలానికి తోలాము. నడిచిరావాలి, సరేకానీ" అన్నాడు.

ఇంతలో లోపల్నించి ఒకాయన వొచ్చాడు దీపంతో, మాసిపోయిన చక్కముఖం, "టెలిగ్రాఫు ఆఫీ"సని వ్రాసివుంది గోడకి.

"టెలిగ్రాం పంపుతారా ?" అన్నాను ఆ కొత్త ఆయన్ని.

"టెలిగ్రాం ? టెలిగ్రామేమిటి ? ఎందుకు టెలిగ్రాం ?"

"నేను వొచ్చానని మా బావకి...."

"ఎందుకు ఆయనకి ?"

"మీకెందు కదంతా ?"

"పంపితీరాలా ?"

"తప్పదు."

"వెంటనేనా ?"

"వెంటనే....ఎప్పటికి అందుతుంది ?"

"రెండుమూడు రోజుల్లో !"

"రెండుమూడురోజులు ? ఎందుకు ?"

"వాళ్ళందరూ ఆఫీసుల్లో వుంటారా ? ఎక్కడికిపోతారో. ఇళ్ళదగ్గిరవుంటే తొరగానే అందుతుంది. మీ అదృష్టం. వ్రాసిఇవ్వండి పంపుతా. మళ్లా రేపువుండను."

ఓ కాయితం రాసి ఇచ్చాను.

"ఇదేంభాష ?"

"ఇంగ్లీషు."

"మాకు తెలీదు."

టెలిగ్రాం బోర్డుమీదనించి గబ్బిలం పెంటలూ, బూజూఅవీ దులిపితీసి కొడితే. తుప్పు పట్టడంచేత అది కదలలేదు.

"పోనీలెండి. రేపు పెద్ద ఆఫీసునించి పంపుతాను."

"ఇంకా ఏం పెద్ద ఆఫీసు? ఈ వూరికి ఇదివొకటే ఆఫీసు" అని లోపలికివెళ్లి నూనె తీసుకొచ్చి ఆ మరలో పోస్తున్నాడు.

నాకు సందేహమొచ్చింది.

"ఇది బొంబేకాదా ?"

"కాక!" అని, మెల్లిగా టెలిగ్రాంకొట్టడం ప్రారంభించాడు.

"అక్కడ తీసుకుంటున్నట్టు లేదు."

"ఎక్కడ ?"

"మద్రాసులో, లేదుగావును !"

ఇంతలో కస్టమ్సువొచ్చి నా కథనంతా విన్నాడు.

"సరే. పెట్టెల్లో ఏమున్నాయో చూద్దాం" అన్నాడు.

"యామయ్యా, బట్టలమీద పన్నువుందా ?"

ఆయన బట్టలుకూడా పొట్టి ఖద్దరులాగూ, బనియనూ.

"ఇన్నిబట్టలు వీల్లేదు. సంవత్సరానికి అయిదు గజాలు....ఇవేం బుడ్లు ?"

"అత్తరు."

"అత్తరా ? వారే, అత్తరుపూసుకునేవాళ్లుకదరా ! దీనిమీద పన్నువుందా? కస్టమ్సు పుస్తకం ఇంటిదగ్గిరవుండాలి....సరేలెండి. ఇవేంబుడ్లు ?"

"విస్కీ."

"విస్కీ ! ఒరే విస్కీ అని విన్నాంకదరా చిన్నప్పుడు ? ఏంచేస్తారు ?"

"తాగుతారు."

"ఎందుకు తాగడం ?"

"వుషారుకి."


"ఓ, సారాకాదుకద !"

"కాదు."

"కల్లుకాదా ?"

"కాదు."





"దాక్షసవకాదా ?"

"కాదు."

"అయితే తీసుకుపొండి. ఈ అత్తరుబుడ్లుమాత్రం వీల్లేదు" అన్నాడు.

"ఎక్కడికి వెళ్ళను ?"

"ఎక్కడికి వెళ్ళాలి ?"

"గొగ్రెపూడికి. రైలెప్పుడు ?"

"ఏం వారం ఇవాళ? శనివారం. ఇవాళ తెల్లారకట్టే మీవేపు రైలు. మళ్ళీ వారందాకాలేదు. నాబండీ వొస్తుంది దాంటో వెడుదురుగాని" అన్నాడు.

కాని పరిస్థితులు భరించలేక ఈలోపల విస్కీ బాగాతాగడంవల్ల తరవాత ఏంజరిగిందో నాకుతెలీదు.

తెల్లారకట్ట లేచేప్పటికి రైల్లోఉన్నాను. ఓ స్టేషనులో ఆగింది రైలు. కిందికి దిగాను. నాపెట్టె ఒక్కటే రైలంతా, ఇన్‌జన్‌కూడాలేదు. నాపెట్టెలో ఓ పక్కన ఎలెక్ట్రిక్ ఇంజన్ వుంది, అంతే.

అది చాలా పెద్దస్టేషన్. పొట్టిలాగూ, బనియనూ వేసుకున్నవారే. అందరికీ ఒకటేబట్టలు. పోర్టరో, స్టేషనుమాస్టరో ఒకడు నుంచునివున్నాడు ఆ స్టేషన్‌లో,

"కాఫీ ఎక్కడ?"

"కాఫీ ? దొరకదు."

"ఎక్కడ దొరుకుతుంది."

"ఎక్కడా దొరకదు."

"రైలు ఇంతేనా ?"

"ఇంతే. ఎవరూ ఎక్కరు."

"ఎందుకు ఎక్కరు ?"

"ఏంపని ? ఏవూరుకి ఆవూరు స్వయం నిర్ణయం."

"ఆకలిగా వుంది."

"కొంచెం మజ్జిగతాగండి."

"టీ ! "

"అవన్నీ మానేశారండీ."

"కాఫీ, టీ ఎస్టేట్లువుండాలి?"

"అక్కడ గొర్రెల్ని మేపుతున్నారు."

రైలు బైలుదేరుతోంది రమ్మని నన్ను పిలుచుకుపోయినాడు డ్రైవరు. పదిగంటలకి నేనూ డ్రైవరూ భోజనంచేశాము. టికట్లకిగాని భోజనానికిగాని డబ్బుఇయ్యనక్కర్లేదు. మధ్యాన్నం ఓ స్టేషన్‌లో ఒక తెల్లఆయన ఎక్కాడు. తెల్లరంగు, చిరిగిపోయిన పాతసూటు, హాటు, ఎక్కడో చూసినమొహం. ఆయనతో సంభాషించాను. ఎప్పుడు ఈ విపరీత స్తితిని అర్థంచెయ్యగల మనిషి దొరుకుతాడా అని ఆతృతపడుతున్నాను. ఆయన పూర్వం కలెక్టరు. ఇంగ్లీషువాళ్ళు వెళ్ళిపోయినప్పుడు వెళ్ళిపోలేదు, ఒక తెలుగు గొల్లపడుచుమీది ప్రేమవల్ల, ఆ సంగతంతా నేను విస్కీబుడ్డి బైటికి తియ్యడంతోటే విరివిగా బైటపడ్డది. తేదీలు పోల్చిచూసుకోగా, నన్ను నాలుగోసారికి ఖైదుకిపంపిన అధికారి ఈయనే. అందువల్లనే నాకా ముఖపరిచయం. విస్కీగ్లాసు చేతులోపట్టుకుని, ముక్కుకి రాసుకుని, నాలికతడుపుకుని 'విస్కీ, విస్కీ, ఎన్నేళ్ళకి విస్కీ.' అని మూర్ఛలుపోతున్నాడు. అధికారం చేతులోలేదుగాని, వుంటే గవర్నమెంటుకి రాసి, ఒక వందయకరాల సుక్షేత్రం నాకురాని ఇచ్చివేసును.

"తాగుడు అసలు దొరకదా ఈదేశంలో ?"

"ఎక్కడా ! ఒకప్రభుత్వంలో వున్నతోద్యోగులకుతప్ప, వాళ్ళకీ అంతా స్వదేశసరుకు. అదీ రహస్యం. దయదలిచి నాకోచుక్క పోస్తోవుంటారు పాతబారు మిత్రులు" అన్నాడు.

ఇంతలో షోలాపూరు వొచ్చాం. ఊరులేదు. పెద్ద స్టేషన్ అట్లానేవుంది. I & II class ladies waiting room లో స్టేషన్‌మాస్టరు తన గేదెల్ని కట్టేసుకున్నాడు.

"ఏమిటీ మార్పు ?" అన్నాను. నా సంగతంతా ఆయనతో చెప్పింతర్వాత.

"ఏంలేదు. పల్లెటూళ్లు స్వయంనిర్ణయమై పోయినాయి. పరిశ్రమలన్నీ కుటీరాలలో చేరాయి. మిల్లులు మూసేశారు. పెద్ద పెద్ద పట్టణాల్లో తిండిలేదు. బియ్యంకూడా పట్టణాలకి ఎగుమతి మానారు. వాణిజ్యం అసలులేదు. తిండిలేక అందరూ పల్లెటూళ్లు చేరుకున్నారు."

"ఈ రైలూ...."

"ఒక్క రైలేమిటి; చూశారా ఆ కార్ల అస్తిపంజరాలు; ప్రయాణంచెయ్యవలసిన అవసరం లేదు. డబ్బూలేదు. ఎరువుబళ్ళుమాత్రం మిగిలాయి."

"మీరూ ?"



"నేను పిన్నులూ, ఇంగ్లీషు ఆటబొమ్మలూ, జలుబుమందూ అమ్ముకుంటున్నాను. మూసేస్తున్న ఓషాపు కొనేశాను. కాని ఎవరూ కొనటంలేదు."

"ఎందుకు కొనరు?"

"డబ్బులేదు."

"ఎందుకులేదు ? ఇంగ్లీషుదోపిడి ఆగిందికదా ?"

"నాకు అర్థికశాస్త్రం రాదు, కాని సరిగా తిండికీ కరువులేను. ఇంకదేనికీ డబ్బులేదు. ఈ స్వయంనిర్ణయంలో వర్తకం పడుకోడంవల్ల డబ్బుపుట్టటంలేదు."

మనిషికి అవసరాలు ఎక్కువచేసుకున్నకొద్దీ ధనం ఎక్కువవుతుంది. తగ్గించుకొన్నకొద్దీ బీదతనం వొస్తుంది.

"ఇప్పుడు కాంగ్రెసేనా పరిపాలన ?"

"ఆ. అదొక్కటే. ఇంకేపార్టీలేదు."

"కమ్యూనిస్టులూ ?"

"కమ్యూనిస్టుల దెబ్బకి దడిసి, వాళ్ళపద్ధతుల్ని కాంగ్రెస్ తానే ప్రవేశపెట్టడం మూలాన, వాళ్లు కాంగ్రెసుతో కలిసిపోయినారు."

"మహమ్మదీయులు ?"

"వాళ్ళా ! ఈ స్వయంనిర్ణయ పద్ధతితో వాళ్లూ అణగారిపోయినారు. దున్నుకుంటేగాని తిండిలేదు. వొడుక్కుంటేనేగాని బట్టలేదు, కట్టుకుంటేనేగాని ఇల్లులేదు, పొద్దస్తమానం దున్ని, వొడికి, వొండి, ఇంకా ఏం పోట్లాడతారు ? వాళ్ళెక్కడా కనపట్టంలేదు, పంచ లెగకడితేనేగాని, లాగులతో. గడ్డాలతో ఏం దున్నుతారు ? ఎద్దులతో పొలంలో స్నేహమై వాటిని చంపడం మానేశారు. అదీకాక, మనిషికి రెండెద్దులూ ఒక ఆవూ కోటా. ఎంత నోరూరినా, ఆ ఎద్దుని వొండుకుంటే పొలం దేంతో దున్నుతాడు ?"

"ఇప్పుడు ఎవరు పరిపాలిస్తున్నారు ?"

"ఎవరూలేరు, ఎలెక్షన్లు ఏడేళ్ళకిందట జరిగాయి. మళ్ళీ జరగవలసిన అవశ్యకత కనిపించలేదు. కౌన్సిలుసెషన్లు లేవు, ఆ మంత్రులు అప్పుడప్పుడు ఆఫీసుకువొచ్చి, గవర్నమెంటు వొంటెద్దు బళ్ళలో ఇంటికివెడతారు."

"కార్లూ...."

"పెట్రోలు తెప్పించరుగా. అదిగాక వేగంగా జరగవలసిన పనులేవీ లేవు."

"మరి హిందువుల పూజలూ దేవాలయాలూ ?"

"హరిజనులు ప్రవేశించడంతో తక్కిన హిందువులు మానేశారు దేవాలయాలకి వెళ్ళడం. అందువల్ల అవసరం కనపడక హరిజనులూ మానారు. Strict రేషన్‌వల్ల పండగలకి ఏమీ వొండుకోడానికీలేదు, ఇతరులకి పెట్టడానికీలేదు. ఎక్కడికిపోయినా అదేతిండి, పూజలు దేనికిచెయ్యడం ? ఏ ఆపదలూ, భయాలూ, వ్యాధులూలేవు. ప్రార్థించి తెచ్చుకోవలిసిన ఆస్తులూ, ధనాలూ ,గొప్పలూ ఏవీలేవు."

"కాఫీ దొరకదేం ?"

"మద్యపాన నిషేధంతో, కార్మికులకి కోపంవొచ్చి వోటుచేసి, పొగాకూ, కాఫీ, టీ మాన్పించారు, కల్లుతాగనివాళ్ళని."

"మరి ఏం మిగిలింది ?"

"ఇదీ" అన్నాడు చుట్టూ చూపి.

రైలాగితే దిగివెళ్ళాడు.

తోవపొడుగుతా దేశంలో సమృద్ధి కనపడుతోంది. ముష్టివాళ్ళూ, ఓదవాళ్లూ కనపడరు. పాటలు పాడుతూ పొలాలలో పనిచేసేవాళ్ళూ, బాగా బలిసిన గొడ్లూ, చక్కని పూరిళ్ళూ కనపడుతున్నాయి. కాని ఏదోలోపం పెద్దలోపంవుంది గాలిలో.

ఒకరోజు తెల్లారకట్టకి చేరుకున్నాను గొ[్రె]పూడి. టెలిగ్రాం అందిందిట, మా బావవొచ్చాడు రైలుదగ్గరికి. స్టేషన్‌లో ఎవరూలేరు. మావాడి రెండెడ్ల బండీమీద నాపెట్టెలు వదేసి బైలుదేరాము. వెన్నెలగావుంది.

మావూరు స్వరూపమే మారింది. చక్కని గుంటలులేనిరోడ్డు, చుట్టూ తోటలూ పైర్లూ. ఒక్కరవ్వ చెత్త, మురికి ఏమీలేవు. మా బావగాడుకూడా బనియనూ చెడ్డీవేసుకుని నాద్రెస్సు వంక వింతగా చూస్తున్నాడు.

"అందరూ ఎట్లావున్నారురా ?"

"బాగానేవున్నాం."

"దేశమంతా సుభిక్షంగా హాయిగా వున్నట్టుంది?"

"వుంది" అని మెల్లిగా మూలిగాడు.

వూరిదగ్గిరిగా వెళ్ళాము. ఈలోపల నాసంగతంతా అడుగుతాడనుకున్నాను మా బావ. నన్ను కలుసుకోడం వాడికి చాలా సంతోషంగా వున్నట్టుంది కాని నాసంగతి ఏమీ అడగటం లేదు. రాత్రంతా నిద్రలేక తల దిమ్మెక్కినవాడిమల్లే వున్నాడు.

వూరిదగ్గరికి వొచ్చేప్పటికి తెల్లారుతోంది - పాటలు పాడుకుంటో మొగవాళ్ళు పొలాలకి పోతున్నారు. ఆడవాళ్ళు గుమ్మాలు వూడుస్తున్నారు.

"చాలా పెందరాళే లేస్తున్నట్టున్నారే !"

"అవును. పెందరాళే పడుకుంటారు, ఏటింటికే."

ఇంటికి చేరుకున్నాము. వెంటనే మా బావ పొలానికి వెళ్ళిపోయినాడు. నాతో మాట్లాడే తీరుబడన్నాలేకండా మా చెల్లెలు ఇల్లువూడవడం అంట్లుతోమడం మొదలైనపనులు చేస్తోంది.

"బైటికిపోవాలి" అన్నాను.

చెంబూ నీళ్ళూ పారా చూపించారు.

"గాంధిగారి పాకీదొడ్లు పెట్టేశారా ఏమిటి ?" అన్నాను.

సిగ్గుతో తలొంచుకు వెళ్ళిపోయింది మా చెల్లెలు.

మా మేనల్లుడు బడికి తయారౌతున్నాడు.

"ఎన్నోక్లాసు చదువుతున్నావోయ్ ?"

తెల్లబోయిచూశాడు నావంక.

"ఏమిటి ? అట్లా చూస్తావు ?"

"క్లాసు చదవడమేమిటి ?"

నాతప్పు తెలిసింది. క్లాసుని ఎట్లా చదువుతారు ?



"ఎన్నోక్లాసులో వున్నావు ?"

"వుండడమేమిటి ? క్లాసు చదవడమేమిటి ? నాలుగోక్లాసు వాడుకుతున్నాను."

"ఓ ! అదీ పెట్టారన్నమాట ! సరే. మీబడికివొచ్చిచూస్తాను."

"బళ్ళోవుండం."

"వుండరా ?"

"పొలానికిపోతాము."

"పోయి ?"

"పండిస్తాము."

"అదీ పెట్టారన్నమాట."

"ఇదిచూడు మామయ్యా" అని గర్వంగా ఒక అట్ట చూపించాడు దానిమీద వాడిపేరూ, వయసూ, $\frac{43\frac{1}{2}}{62}$—I $\frac{39}{9}$—II $\frac{52\times 6}{4}$—III అని వేసివుంది.

"అంటే ?"

"ఒస్, ఇదేతెలీదా ? 62 నంబరునూలు $43\frac{1}{2}$ గజాలు వాడికాను పోయిన పరీక్షలో— 9 అంగుళాలలోతున 39 గజాలు దున్నాను అరగంటలో. 4 నెలల్లో 52 వంకాయలు 6 వీశలు తూగేవి పండించాను అన్నమాట."

"నీకేమన్నా పుస్తకాలు వున్నాయా ?"

"లేవు."

"రాయడం, చదవడం చెప్పరా ?"

"ఆరోక్లాసులో ప్రారంభిస్తారుట."

అంటో వెళ్ళిపోయినాడు.

చెల్లెలు పేడచేస్తోంది.

"పనిమనుషులు దొరకరా ?"

"దొరక్కేం ? ఆమాట పిగ్గిరిగా అన్నావంటే ఇరుగుపొరుగునించి గుమికూడతారు. ఈపనిలేకపోతే ఇంకేంతోస్తుంది ?"

వూరువెంబడి బైలుదేరాను చూద్దామని. అంతా శుభ్రంగావుంది. కాని ఎవరూ బైటకనపట్టంలేదు మనుషులు, ప్రతిఇంట్లోంచీ రాట్నాలధ్వనీ, వంటలు అట్టహాసమూ వినబడుతోంది, ఇళ్ళకి తలుపులులేవు.

"ఈవూళ్ళో హోటలులేదా ?"

"లేదు. ఎందుకు ? మాఇంట్లో భోజనంచేస్తావా ?" అని ఆశగా అడిగాడు ఆపెద్దమనిషి.

"కాదు. కాఫీ, ఇడ్లీ...."

"ఏమిటవి ?"

"ఓ, భోజనశాల హోటలువుండదా ?"

"ఎందుకు హోటలు ? ఎవరింట్లోనన్నా భోజనంచెయ్యొచ్చు. ఆఫీసులోచెపితే సరి; కాని ఎవరుచేస్తారు?" అన్నాడు మళ్లీ దిగులులోపడి.

ఆ వూరికంతా ఒకటే ఆఫీసు. అంటే ఒకస్టోరు. ఆఫీసు ఎప్పుడూ మూసేవుంటుంది. అక్కడోగుమాస్తా ఆవాలు లెక్కపెడుతున్నాడు.

"ఏమిటది ?" అన్నాను.

"ఇంకేం పనిలేక....మీరేనా ఈవూరికి కొత్తగా వొచ్చినవారు ?" అన్నాడు వింతగాచూసి దిగులుపడుతూ.

"చెప్పాడులెండి, మీ బావగారు" అని ఆవాలు లెఖ్కపెడుతున్నాడు మళ్ళీ.

ఓ వంద కుప్పగాపోసి,

"ఏమన్నా కొనడానికి వొచ్చారా ? తీసుకోండి కొలుచుకుని. డబ్బు ఇక్కడపడెయ్యండి" అన్నాడు.

ఆవూళ్ళో పండనివి, చింతపండు, బెల్లం, మెంతులు ఉల్లిపాయలు మొదలైన సరుకులు వున్నాయి.

నిర్జనమైన వీధుల్లో అట్లాతిరిగి ఇల్లు చేరుకున్నాను. మా బావవొచ్చాడు స్నానంచేసి. భోజనానికి లేచాము. భోజనం మామూలుగానేవుంది. వంటింటో ఒక బోర్డువుంది. దానిమీద—

అన్నం - అర్ధశేరు - 200 కాలరీలు.

పప్పు - 8 తులాలు - 50 కాలరీలు.

వంకాయకూర - 8 తులాలు - 10 కాలరీలు.

గోంగూరపచ్చడి - 4 తులాలు - 2 కాలరీలు.

గేదెపెరుగు - 12 తులాలు - 100 కాలరీలు.

అని వ్రాసివుంది.

"ఏమిట్రా ఇది ?" అన్నాను.

"అంతేసంగతి. అన్నికాలరీలే వొప్పుకుంటారు మనిషికి."

"ఎక్కువ తింటే...."

"అంతేఇస్తారు సామగ్రి."

"ఈ రాత ఎందుకు ?"

"వొచ్చి చూస్తారు ఆహార ఆఫీసరు. అందుకని అందరూ 11, 12 మధ్య భోజనంచేసితీరాలి."

"మనకి కావలిసినవి కొనుక్కుంటే..."

"ఎక్కడ కొంటావు ? అన్నీ కొనుగోలు సంఘాలలోంచి సప్లయి. వర్తకులూ దుకాణాలూ లేవు. ఒక్క గవర్నమెంటు స్టోర్సులోనే దొరుకుతాయి. పంటవొస్తువులు అమ్మరు. కావలిసినదానికన్న ఎక్కువ పండించకూడదు."

"తక్కువపండే ప్రదేశాలలో ?"

"అన్ని ఇరిగేషన్ Projects వల్ల అన్నిచోట్లా పండుతాయి. పండనిచోట్లకి గవర్నమెంటు Farms నించి సప్లయి".

"చాలాగొప్ప ఏర్పాట్లుచేశారే !"

"అవును."

"పోనీ ఎక్కువ పండించుకుని, ఎక్కువ తినకూడదా ?"

"భూమి ఏదీ ! అంతా సరిగా పంచేశారు."



"మరి కొత్త వ్యవసాయపద్ధతులమీద....Tractors, ఎరువులూ అవీ పెట్టి, పండించకూడదూ, అమెరికాలో మల్లే ?"

"Tractors మెషిన్లు. వీల్లేదు. ఎక్కువగా పండించి ఉంచేసుకోము ? ఎవరిపంట వారికేవుంది."

"మీరే తింటేనేం ?"

"తప్పకండా అవసరమైనదానికన్న అనుభవించకూడదని రాచకీయ నియమం."

మధ్యాన్నం వొంటిగంటకి వాళ్ళు బైలుదేరి నన్నూ రమ్మన్నారు. రానన్నాను. హాజరు తీసుకుంటారు. ప్రతిమనిషి వెళ్ళి తీరాలన్నారు.

"ఎక్కడికి ?"

"టౌను హాలుకి."

"ఎందుకు ?"

"కాలక్షేపం"

ముందు ఒకతను హిందీలో భారతమాతని ప్రార్థించాడు. తరువాత ఆ వూరికవి తాను మినుములమీద రాసినపద్యాలు 52, 21, 13, 15, 24, 28, 36, 11.

Reading-1, 19, 33, 26.

వినిపించాడు. తరువాత ఒక యోగప్రదర్శనం, వ్యాయామ ప్రదర్శనం ఆ వూరివాళ్లు చూపించారు. మా బావ కునికిపాట్లు పడుతున్నాడు.

"చూడవేంరా ?"

"రోజూ ఇదే ! ఎన్నేళ్లు చూడను ?"

తరువాత ఓ కధకుడు, కాకిమీద కథ చదివాడు.

రేడియో తిప్పారు.

ప్రార్థనపాటా, పంటల్నిగురించి సలహాలూ, తరువాత నీతి ఉపన్యాసాలూ, రైళ్ల రాకపోకలూ, కొన్ని లాలిపాటలూ, పతివ్రతలపాటలూ, తరవాత దేశవార్తలలో, ఉద్యోగస్తుల ఆరోగ్యవిషయాలు చెప్పారు. అందరూ నిద్రగా దిగులుగా కూచునివిని తలవొంచుకుని ఇళ్లకి వెళ్లిపోయినారు. సాయంత్రం నాలిగింటికల్లా మొగవాళ్లు పొలాలకి వెళ్లిపోయినారు. ఆడవాళ్లు పశువులదాణాలూ, బట్టలు వుతకడాలూ, వంటప్రయత్నాలూ చేస్తున్నారు. సాయంత్రం షికారు వెళ్లాను గాని వూళ్లో పిల్లలైనా కనపళ్లేదు. రాత్రి ఏడింటికి ఇల్లు చేరుకున్నాను.

ముందు మేనల్లుడు వొచ్చాడు నేను పెట్టె సద్దుకుంటోవుంటే. తా నెన్నడూ చూడని వొస్తువుల్ని చూసి అవేమిటని ప్రశ్నిస్తున్నాడు.

"ఏం చదివావు ఇవాళ ?"

"చదవడమేమిటి ? చదవం"

"చరిత్ర నేర్చుకుంటారా మీరు ?"

"నేర్చుకుంటాం."

"ఏం చరిత్ర ? అక్బరు ఎవరు చెప్పు."

"విన్నానులే. అక్బరూ, అశోకుడూ, విక్రమాదిత్యుడూ, కృష్ణదేవరాయలూ వీళ్లందరూ బుద్ధి తక్కువవాళ్లు. బీదల్ని దోచుకున్నారు, యుద్ధాలుచేసి ప్రజల్ని చంపించారు. పంటల్ని నాశనంచేశారు. ధనికుల్ని ఇంకా ధనికుల్నిచేశారు."

"అయితే మీరు చదివే చరిత్ర ఏమిటి?"

"విప్లవయోధులూ, కర్షకవీరులూ....."

"ఎవరు వాళ్లు?"

"వాళ్ల పేర్లు తెలీవు. మొదట ఎప్పుడు ఎవరు వరి విత్తనాన్ని నాటారు? ఆవుని చేపాలుతీసి పెరుగు చేశారు? ఇట్లాంటివి. పత్తినించి నూలు తీసిందెవరు? వాళ్లా అసలు గొప్పధన్యులు"

"ఎవరు వాళ్లు?"

"అదే రిసర్చి చేస్తున్నాము."

"ఎట్లా?"

"చేస్తాం. అంటే ఆలోచిస్తోవుంటాము."

"వుండి"

"ఆలోచిస్తాము. ఎప్పటికో కొత్తచరిత్ర సృష్టిస్తాము."

"ఫోనీ-సయన్సు నేర్చుకుంటారా?"

"ఆ"

"ఎట్లా?"

"చూస్తాం. పరిశీలిస్తాము."

"ఏం చూస్తారు?"

"అన్నీ, ఆకాశం, అడువులు, పైర్లు, పిల్లులు."

"చూస్తారా? ఇదివరకు చూడలేదా?"

"ఇప్పుడు పరిశీలిస్తాం."

"ఎట్లా?"

"అట్లా చూస్తాం. మిడతని చూస్తాం. అట్లా చూస్తోవుంటాం. మిడతకి కాళ్లున్నాయి. కడుపువుంది. కీళ్లున్నాయి. ఇట్లా—మర్రిచెట్టుకి వూడలున్నాయి. ఇట్లాంటివి తెలుసుకుంటాం. అన్నిట్లోకీ ముఖ్యం పత్తిమొక్క."

"పత్తిమొక్కని పరిశీలించి ఏం తెలుసుకున్నావు?"

"పత్తికాయలోంచి పత్తి వొస్తుందని."

"అవి తెలీదా?"

"పూర్వం మీరు చదివేవారు. ఇప్పుడు మేం చూశాము. ఆకాశం నీలంగావుంటుంది. ఎంత వేడిగా వుంటుంది ఇట్లాంటివి"

"ఏమన్న లెఖ్ఖలు చేస్తారా?"

"ఆ. గంటకి ఎన్నిగజాలదారం? ఎంతనూలు ఎంతబట్ట అవుతుంది?"

"డబ్బు లెక్కలు చేస్తారా?"

"అలాస్కాలో కూలీలు ఎంత సంపాయిస్తారు? వాళ్లకి రోజుకి ఎంత ఖర్చు? ఎంత తగ్గించడానికి వీలుంది?"

"అలాస్కా? ఎక్కడవుంది?"

"అదఖ్ఖర్లేదు."



"భూగోళం చదవరా?"

"చదవం. చూస్తాం. ఈ కాలవఅవతల ఏముంది? కుమ్మరి కుండలు చేస్తాడు. ఈవూళ్లో కాకులు వుంటాయి. ఇవన్నీ."

ఇంతలో నన్ను భోజనానికి పిలిచారు.

ప్రతిఇంటిలోనూ ఎలక్ట్రిక్ లైట్లు. శుభ్రంగావున్నాయి ఇళ్లు. పాత ఆచారాలన్నీ పోయినాయి.

భోజనమైనాక వరండాలో కూచున్నాము నేనూ మాబావా. కొత్త మార్పుల్నిగురించి చెపుతున్నాడు దిగులుగా. కుర్రాడు కూచున్నాడు లోద్దుకేసిచూస్తో. ఇంతలో ఒకాయన వొచ్చాడు. ఆయన ఆ వూరికంతటికీ అధికారి. కొత్తగా నేను వొచ్చాను గనుక నాసంగతి రాసుకోడానికి వొచ్చాడు. దేశానికి వొచ్చిన ఈ మార్పుసంగతి చాలాసేపు మాట్లాడుకున్నాము. పూర్వకాలంవుండే శారీరక మానసికవ్యాధులు చాలావరకు తగ్గాయి. ఈర్ష్యలు, పోటీలు, ముందు ఎట్లా బతకడమనేభయం, పిల్లలేమౌతారనే ఆదుర్దా, ధనార్జన, ధనం కూడపెట్టడం, ఆస్తి సంపాయించడం – ఇటువంటి బాధలన్ని పోయినాయి నిశ్చయంగా. అధికారులకి బానిసత్వం, ప్రభుత్వభయం, నీచత్వం, మోసం, మొదలైనవి లేనేలేవు.

"అంటే రామరాజ్యం – భూలోకస్వర్గమన్నమాట?'' అన్నాను.

"ఊ" అని మూలిగారు.

"ఏం?" అన్నాను.

"స్వర్గంకూడా ఇట్లానే వుంటుందేమోనని భయం" అన్నాడు మా బావ.

"ఏమి? అదేకదా మనం కలలుకన్నది? మతాలన్నీ ఆశపెట్టింది? నిరంతరశాంతి. ఈ భూమిమీద జీవితషుజ్వరం తరవాత ఆలోకంలో శాంతి అనేకద! ఆ శాంతి ఇక్కడే కలిగితే ఇంకేంకావాలి."

"అవును, ఇక్కడ ఈలోకంలో అశాంతి, తీరనికోర్కెలూ వున్నంతకాలం, అవన్నీ ఆలోకంలో వుండవని, సత్యం, శాంతీ, సౌఖ్యం, ఇవన్నీ అక్కడ వుంటాయని కలలు కన్నాము. కాని అవన్నీ ఈలోకంలోనే లభ్యమైతే, కలలుకనడానికి ఏమీ మిగలలేదు."

"నేనుచూసిం దేమిటంటే, ఇంతశాంతీ, ధర్మం, ఏర్పడినా, మనుషుల్లో ఉత్సాహమూ, కళా, కనపడవేం? ఏదో నిద్రపోతున్నట్టూ, ఏం చాతగాక ఇటూ అటూ వెతుకుతున్నట్టూ, పదేళ్ళమట్టి పంజరాల్లో కాలంగడిపిన పిట్టల్లాగ కనపడతారేం మనుషులు? ఎంతకాలంనించి కలలుకన్నాం ఈ శాంతికోసం?"

"కాని పనిభారం. పొద్దస్తమానం పని."

"ఎక్కువ పనివున్నట్టులేదు'' అన్నాను.

"లేదు. కాని ఉన్నపని భారం. పనిలోనించి పనితప్పించుకునే ఆశవుండాలి. గానుగ ఎద్దుమల్లే జన్మఅంతా ఇదే అని అనుకుంటే, పని భారమౌతుంది ఎంత కొంచమైనాసరే. పూర్వం కుర్రాడు II ఫారం చదివేవాడు. పైక్లాసులకి వెళ్ళినా వెళ్ళకపోయినా, వెడతాం, మార్పువుంటుంది అనే ఆశవుండేది. జీవితమంతా ఇవే చదవాలని నిబంధనవుంటే

ఏమవుతాడు ? మానవస్వభావం విచిత్రం. దాన్ని అంకెలలోకీ, ఫార్ములాలలోకీ మార్చి పోల్చించడం బుద్ధితక్కువ. పనీకావాలి. పనీ అక్కర్లేదు. ఇప్పుడు మనిషికి పనితక్కువ పనికావాలని వుంటుంది. కాని ఉన్నపని భారం.''

"కాని సరదాలులేవు, పాడతారు. కాని అవీ భారంగానే. పత్రికలు, పుస్తకాలు, సినిమాలు, పాటకచేర్లు, ప్రదర్శనాలు, ప్రయాణాలు ఇవన్నీ ఏమైనాయి.''

"మొదలు ఎబ్బుతక్కువ. రెండోది, ఎంత బలహీనులనుకున్నా, కీర్తి, వానిటీ, మెప్పూ, ఇట్లాంటివి కొన్ని అవసరం మనుషులకి. ఎందుకుపాడాలి ? నాటకాలాడాలి ? ప్రదర్శించాలి? ఘనతకి. ఇప్పుడుచూస్తాం, కాని ఘనతనివ్వం. నీకది చాతనవును. ఐతేనేం ? మీకెందుకు అనిపిస్తుంద." అందువల్ల ప్రోత్సాహంలేదు.

అన్నిటికన్న, జీవితానికీ కళకీ సంబంధం వుంటేనేగాని కళని అనుభవించలేము. ఈ జీవితంలోంచి ఏకళారాదు. స్ట్రగుల్, యత్నంవుండాలి. ఎవడన్నా కళను కల్పించినా, అది ప్రజలకు రుచించదు.

ఆకలివుంటేనేగాని భోజనంరుచి అనుభవించం. బిచ్చగాడికైనా కలలు ఇంకోకానీ ఎక్కువ దొరుకుతుందని, దొరికితే సంతోషం. ఈజన్మలో ఏంలేకపోతే, ఆలోకంలో. వొచ్చేజన్మలో. పల్లెటూళ్ళనించి ఏడాదికోసారైనా పట్టణానికిపోయి, ఓ రెవిక కొనుక్కోడం. Competition ఈర్ష్య, వ్యభిచారం ఇవన్నీపోతే జీవితం ఇట్లా అయ్యింది. కుర్రాడికీ తండ్రికీకూడా ఎన్ని కలలు. పెళ్ళిళ్ళు కట్నాలు - పోయింది ఆకాలం.

పూర్వం సర్వసంపన్నుడైనవాడికి జీవితం ఎంత అర్థవిహీనంగా వుండేది. ఏంతోచేదికాదు. యత్నమూ, కోర్కె, ఆశయమూ లేకపోవడంవల్ల ఇప్పుడు ఆ తోచకపోవడం, అర్థంలేక పోవడమనే బాధ సర్వసామాన్యమయింది. ఇప్పుడు సినీమాలు ఎవడూచూడడు. ఆ సినీమాలలో ఏబాధలూ, ఏ ఆశయాలు, ఏ అందాలు చూపినా, వాటికీ జీవితానికీ సంబంధంలేదు. ఆకారణం, ఆ బాధలు వొస్తాయని భయములేదు. ఆ అందాలు చిక్కుతాయని ఆశాలేదు."

"మరి రొమాన్సు ఏమయింది ? వ్యభిచారమన్నా లేదా ?"

"అదీ అణగారిపోతోంది. దేహాలు అమ్ముకోవలిసిన అవసరం లేదనుకోండి. జీవితపు రంగులమీదా, రహస్యాలమీదా ఎప్పుడు ఉత్సాహం తగ్గిందో అప్పుడే ఈ యత్నాలన్నీ తగ్గేట్టున్నాయి."

"ఏం జరగిందంటారు?"

"ఏంలేదు. కొడుక్కి పాతికేళ్ళువొచ్చి చాలా అప్పుల్లోకీ, తగాదాల్లోకీ, జూదాలకీ దిగాడను కోండి, అతనిమీద చాలా జాలిపడి తండ్రి, పిల్లవాడివిగా ఉన్నప్పుడు ఎంతశాంతంగా సంతోషంగా, నిర్మలంగా వుండెవాడివి!'' అని బలవంతంగా తండ్రి బొమ్మలూ అవీ ఇచ్చి ఆడుకోమంటే అతనేమౌతాడో దేశమంతా అట్లా ఐనట్టుంది" అన్నాడు.



# విజయ

బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం

(గతసంచిక తరువాయి)

మా దొడ్డమ్మ ఉత్తరం నాలో అనేకమార్పులు కలుగజేసింది. ఇన్నాళ్లూ తను నాకొక దేవతలా ఉండేది. తనవంటి మనిషి లేదనుకునేవాడిని. అటువంటిది తనంటే ఎక్కడలేని అసహ్యం నాలోపుట్టుకొచ్చింది. తన ఉత్తరానికి నేను జవాబువ్రాయలేదు. మళ్లీ వ్రాసింది. దానికీ జవాబు వ్రాయలేదు. ఇకమీదట తనకీ నాకూ ఏమీ సంబంధంలేదని నిశ్చయించుకున్నాను.

సులభంగా నాఊహలతో ఏకీభవించి, విజయని నన్ను పెళ్లిచేసుకోనిచ్చి, కష్టసుఖాలకి నాదై, నాకు తల్లిలేని లోటుతీర్చి, నాజీవితాన్ని కాపాడుతుం దనుకున్నాను. ఈవిషయంలో సాంఘికంగా తనదృష్టి నాదృష్టికి ఇంత వ్యతిరేక మని నేను గ్రహించలేకపోయాను. ఇంత తెలివితక్కువగా ఎలాఉండగలిగేనా అనిపించింది. ఎరుగున్న వ్యక్తివిషయంలోనే ఇంత పొరబడడం చాలా సిగ్గని పించింది. తనకి నేను వ్రాసేఉండకూడదు. విజయని పెళ్లిచేసుకుని, అలా పెళ్లి చేసుకున్నట్టు మా దొడ్డమ్మకి తెలియపరచవలసింది. అంతకిముందు ఆవిడకి సమ్మతికనికాని దీవనకనికాని వ్రాయడం తెలివితక్కువపని. ఇప్పుడు నా చేతకాని తనమంతా విజయముందు బయటపెట్టి, మా దొడ్డమ్మ అడ్డుపడ్డప్పటికీ, అదొక పెద్ద అభ్యంతరంగా ఎంచుకోకుండా, విజయని నన్ను పెళ్లిచేసుకోమని బతిమాలాలి. మా దొడ్డమ్మ ఒప్పుకున్నప్పటికీ తను ఒప్పుకోక పోవచ్చుననే విజయ, మాదొడ్డమ్మ ఒప్పనప్పుడు అసలే ఒప్పుకోకపోవచ్చునని నాకు తెలుసును. ఇతరుల జోక్యం లేకుండా తను నన్ను పెళ్లిచేసుకునేందుకు నిశ్చయించుకున్నట్టు విజయ నాకు మాటిస్తే, నన్ను వెనక్కిలాగడానికి ప్రయత్నించే మా దొడ్డమ్మని తిప్పి తిరిగి ఒప్పించే ధైర్యమూ ఉత్సాహమూ నాలో ఉండుండును. ఇద్దరినీ ఒప్పించవలసిన పరిస్థితిలో ఇద్దరిమీదా అమితమైన ఆగ్రహం కలిగింది. విజయని కలసుకోవా లనిపించేదికాదు. కలసుకున్నా ఆట్టేసేపుండా లనిపించేదికాదు.